క్లుప్తంగా

అమలాపురం 'స్పెషల్' మెజిస్ట్రేట్‌గా ప్రసాదరావు


మెజిస్ట్రేట్ వెంకట ప్రసాదరావు

అమలాపురం టౌన్: అమలాపురం స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు స్పెషల్ మెజిస్ట్రేట్‌గా పులిదిండి వెంకట ప్రసాదరావు నియమితులయ్యారు. అంబాజీపేటకు చెందిన వెంకట ప్రసాదరావు రాష్ట్రంలోని పలు కోర్టుల్లో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం అమలాపురం స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు మెజిస్ట్రేట్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన మెజిస్ట్రేట్ వెంకట ప్రసాదరావును ఇక్కడ కోర్టుల సముదాయంలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు అభినందించారు.

గుత్తినదీవిలో హిందూ ధర్మ ప్రచారం

ఐ.పోలవరం: దేవాదాయశాఖ హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం మంగళవారం గుత్తినదీవి గ్రామంలో నిర్వహించారు. మురమళ్ల వీరేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఉమా రాజేశ్వరి దేవస్థానంలో లలిత, విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమం జరిపారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రచార మహోత్సవంలో భాగంగా ముమ్మిడివరం మండలం పల్లిపాలెంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 18న అమలాపురం నాట్య వేద కూచిపూడి అకాడమీ వారిచే నృత్య ప్రదర్శన కార్యక్రమం ఉంటుందని ఈఓ తెలిపారు.

గణపతి ఆలయంలోకి తాచు పాము


స్నేక్ క్యాచర్ డబ్బాలో బంధించిన తాచు పాము

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద గల శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలోకి మంగళవారం ఉదయం ఓ తాచుపాము రావడంతో కలకలం రేగింది. అయితే కార్తిక మాసం తొలిరోజు సాక్షాత్తు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోకి వచ్చినట్లుగా భక్తులు సెంటిమెంట్‌గా భావించారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ వచ్చి పాముకు హాని తలపెట్టకుండా ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. శివారు ప్రాంతాల్లో పామును వదిలేస్తానని స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ తెలిపారు.

కుర్చీలు, ఫ్యాన్‌ల బహూకరణ


కుర్చీలు, ఫ్యాన్‌లు అందిస్తున్న సర్పంచ్ నక్కా అరుణకుమారి దంపతులు

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు, సర్పంచ్ నక్కా అరుణకుమారి, చంద్రశేఖర్ దంపతులు రూ.40 వేలతో 50 కుర్చీలు, 8 ఫ్యాన్‌లు బహూకరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చొల్లంగి శ్రీను, గుత్తుల నాగేంద్ర, దేవరపల్లి భవాని కామన రమాదేవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన


చల్లపల్లిలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లీలాకుమారి

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, గోపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలాకుమారి, రమాదేవిల ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎల్ రాణి, కె.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

అమలాపురం రూరల్: స్థానిక వడ్డిగూడెం కళాశాల బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల్లో ఉత్తమ మార్కులు ఎలా సాధించాలో సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జ్యోతి లక్ష్మీదేవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలి

యానాం: దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీకి చెందిన పంట పొలాలను రక్షించేందుకు చేపట్టిన గోదావరి వరద రక్షణ గట్టు పనులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం పరిశీలించారు. రక్షణ గట్టు పటిష్టం చేయడానికి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అశోక్‌ను స్థానిక రైతులు కోరారు.

విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు


గోడిలో గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడిలోని గ్రంథాలయంలో జరిగిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత బాలల దినోత్సవం పురస్కరించుకుని మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీదేవి, రేవు శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి పి.సత్యనారాయణ పాల్గొన్నారు. అల్లవరంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యుడు కొనుకు బాపూజీల ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి.

అమలాపురం టౌన్: గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలని అమలాపురం 12వ వార్డు కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు అన్నారు. అమలాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మంగళవారం 56వ గ్రంథాలయ వారోత్సవాలను కౌన్సిలర్ సన్నయ్యదాసు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ వీఎస్ఆర్ రంగనాథన్, పోతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత, అడబాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సన్నయ్యదాసు


ఉప్పలగుప్తం గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో సత్యకృష్ణ

ఐ.పోలవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి అంబటి వెంకట నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి స్థానిక జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం వి.సురేష్‌బాబు, సాహితీవేత్త పి.వెంకటేశ్వరావులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. దేశ చరిత్రలో ఎందరో ప్రముఖులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదువుకుని ప్రయోజకులు అయ్యారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పుస్తక జ్ఞానం పెంచుకోవాలి

ఉప్పలగుప్తం: విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక జ్ఞానం పెంచుకోవాలని ఎంఈవో సత్తి సత్యకృష్ణ అన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయాల్లో మంగళవారం ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి, గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా నమ్మకం

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట-2 సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే రోల్‌మోడల్‌గా మారిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘానికి నూతన కార్యవర్గం


అమలాపురం డివిజన్ బీసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం డివిజన్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంఘం జిల్లా అధ్యక్షుడు కేతా భాస్కర రామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘానికి నూతన అధ్యక్షుడిగా గుత్తుల పుల్లయ్యశెట్టి, ప్రధాన కార్యదర్శిగా కేవీఎస్ గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా దర్మాడి గౌరీశంకర్, ఉపాధ్యక్షుడిగా చిట్టూరి రామకృష్ణ, కె.వెంకటరమణ, సీహెచ్ రామప్రసాద్, దొంగ ప్రేమ్‌కుమార్, పి.వెంకటరమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.బాలశంకర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను భాస్కర రామారావు అభినందించారు.

వీరేశ్వరుని దర్శించుకున్న హోంగార్డ్స్ కమాండెంట్


వీరేశ్వరుని సన్నిధిలో హోంగార్డ్స్ కమాండెంట్ రామ్‌మోహన్

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామిని విశాఖ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ జి.రామ్‌మోహన్ మంగళవారం దర్శించుకున్నారు. అర్చకులు, పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన


గోసంగివారిపేటలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


సంక్షేమ పథకాల లబ్ధి జాబితాను ప్రదర్శించిన ఫ్లెక్సీ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి తదితరులు


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు తదితరులు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అన్నారు. స్థానిక కల్వకొలనువీధిలోని 3వ వార్డు సచివాలయ ఆవరణలో మంగళవారం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. జగన్ ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పేద, బలహీన వర్గాల కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉంటున్నాయని గుర్తుచేశారు. వార్డు సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి జాబితా ఫ్లెక్సీని ప్రదర్శించారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ఆయా కుటుంబాలకు గణాంకాలతో సహా వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, కల్వకొలను ఉమ, బెజవాడ సత్తిబాబు, ఖ్వాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదలకు సంక్షేమం

అల్లవరం: అర్హులైన పేదలకు సంక్షేమం పూర్తి స్థాయిలో అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సర్పంచ్ బొమ్ము బాలవేణి అధ్యక్షతన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని అల్లవరం-1 సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏపీకి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే పేదలందరికీ మేలు జరుగుతుందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ నిచ్చెనకోళ్ల మౌనిక, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జిల్లా ప్రధానకార్యదర్శి మెరికల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని గున్నేపల్లి అగ్రహారంలో వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ అధ్యక్షతన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నాలుగున్నరేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి లబ్ధిదారులకు నేరుగా సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్‌లు అన్నారు. అనంతరం సంక్షేమ బోర్డుని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరెడ్డి రాము, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని జి.మూలపొలంలో సర్పంచ్ విజయలక్ష్మి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలందరూ ముక్త కంఠంతో కోరుకుంటున్నారన్నారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, కాటం సత్తిరాజు, ఎం.చిన్నా, కొండేపూడి కృపావరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు భద్రత

అల్లవరం: దిశ యాప్‌తో మహిళలకు భద్రత లభిస్తుందని, ప్రతీఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. అల్లవరం, బెండమూర్లంక, బోడసకుర్రు జాతీయ రహదారిపై మంగళవారం అల్లవరం పోలీసులతో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆపి వారి ఫోన్లో దిశ యాప్‌ని డౌన్‌లోడ్ చేసి వారికి అవగాహన కల్పించారు.

జాబ్ మేళాలో 84 మందికి ఉద్యోగావకాశాలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 84 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారు. జాబ్ మేళాలో కోజెంట్-ఈ-సర్వీస్, డెక్కన్ కెమికల్స్, ఇసుజు మోటార్స్ లిమిటెడ్, సోలార్ యాక్టివ్ ఫార్మా కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తంగా 220 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 84 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వికాస్ జిల్లా అధికారి రమేష్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

అల్లవరం: మండలంలోని గోడితిప్ప యూపీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న బసవా శేషాంబ రూ.11,500 విలువ చేసే బీరువాను పాఠశాలకు బహూకరించారు. బీరువా తాళాలను పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వేణుగోపాల్‌కి మంగళవారం అందజేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సీఐ ఎస్.కొండయ్య

ముమ్మిడివరం: ఏలూరులో ఇటీవల జరిగిన ఆదికవి నన్నయ్య అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ముమ్మిడివరం హెల్దీలైఫ్ జిమ్ విద్యార్థులు దొమ్మేటి వేణు మణికంట బంగారు పతకం, సంసాని సత్యనారాయణ సిల్వర్, వి.లవ్‌కుమార్, పొత్తూరి కుమార్‌రాజాలు కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య అభినందించారు.

పాహిమాం.. పరమేశ్వరా..

ముక్కంటి క్షేత్రాలకు కార్తిక శోభ


ప్రత్యేక అలంకరణలో మురమళ్ల వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం: పవిత్రమైన కార్తిక మాసం ప్రారంభం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంతో పాటు కేశనకుర్రు, టి.కొత్తపల్లి, ఎదుర్లంక, ఐ.పోలవరం తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మురమళ్లలో వేకువజామునే భక్తులు వృద్ధ గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి పంచామృత అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు పర్యవేక్షించారు.

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన-ఎర్ర వంతెన మధ్య గల శ్రీదక్షిణామూర్తి శక్తి స్థల్‌లో శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థకు చెందిన మహిళలు చతుర్ధ శాంతి యమధర్మ స్థూపంపై మంగళవారం రాత్రి దీపాలు వెలిగించి జ్యోతిర్లింగార్చన గావించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి శ్రీరామ మందిరంలో పండితులు మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సన్ స్పిరిచ్యువల్ సొసైటీ ఫౌండర్ విక్రమాదిత్య మహాలింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మట్టితో 365 శివలింగాలను చేసి పార్థివ లింగార్చన రుద్రహోమం జరిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం

యానాం: కార్తిక మాసంను పురస్కరించుకుని మంగళవారం పవిత్ర స్నానాల కోసం స్థానిక గౌతమీ గోదావరి తీరం భక్తజనంతో నిండిపోయింది. స్థానిక శివమ్‌బాత్ వద్ద యానాం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుంచే కార్తిక స్నానాలు ఆచరించి పుష్కరమాత విగ్రహం, శివలింగాలు, ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద భక్తిశ్రద్ధలతో కార్తిక దీపాలు వెలిగించి పూజలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక శివాలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.


అమలాపురం చతుర్ధ శాంతి స్థూపంపై జ్యోతిర్లింగార్చన గావిస్తున్న భక్తులు


గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సాంకేతిక పరిజ్ఞానంపై పేటెంట్ హక్కులు


అధ్యాపకుడు సుందర్‌కుమార్

అల్లవరం: రెండు లేదా మూడు దశాబ్దాల తర్వాత పట్టణ ప్రాంతాల్లోని స్థితిగతులను అధ్యయనం చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించిన ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు కుసుమ సుందర్‌కుమార్‌కు పేటెంట్ హక్కులు లభించాయని ప్రిన్సిపాల్ చంద్రమౌళి మంగళవారం తెలిపారు. సుందర్‌కుమార్ రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానంతో పట్టణ వాతావరణంలోని మార్పులను ముందుగానే పసిగట్టొచ్చన్నారు. పేటెంట్ హక్కులు సాధించిన సుందర్‌కుమార్‌ని బీవీసీ యాజమాన్యం, ఇతర విభాగాల అధ్యాపకులు అభినందించారు.

డీఎస్పీ అంబికాప్రసాద్‌కు సత్కారం


డీఎస్పీ అంబికా ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైశ్య నాయకులు

అమలాపురం టౌన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవా పతకానికి ఎంపికైన అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్‌ను పట్టణ వైశ్య సంఘ ప్రతినిధులు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వంకాయల కాశి, యండూరి నాగేశ్వరరావు, యెండూరి వెంకట్రామయ్య, నంబూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం

అమలాపురం రూరల్: అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ సమస్యలపై సుదీర్ఘ చర్చ సాగింది. గున్నేపల్లి అగ్రహారం సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు వేదికపై ప్రొటోకాల్ పాటిస్తున్నారా అంటూ నిలదీశారు. గ్రామంలోకి ఏ అధికారి వచ్చిన తనకు సమాచారం ఇవ్వడం లేదని చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామాల్లోకి వెళ్లినప్పుడు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ఈవోపీఆర్డీ మల్లికార్జునరావుకు ఎంపీపీ భాగ్యలక్ష్మి సూచించారు. ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఎ.వేమవరప్పాడులో పంట భూములకు సాగునీరు అందడం లేదని ఇరిగేషన్ ఏఈ రెహమాన్‌ను ప్రశ్నించారు. ప్రైవేటు భవనాల వ్యర్థాలను కాలువల్లోకి వదిలేస్తుంటే ఏమి చేస్తున్నారంటూ ఏఈపై జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ మండిపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి సూచించారు.

బాలలే భావి భారత నిర్దేశకులు


పశువుల్లంక జెడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు మునీశ్వరరావు


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మహమ్మద్ రెహంతుల్లా


బహుమతులు అందుకున్న విద్యార్థులతో లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు

ఐ.పోలవరం: నేటి బాలలే రేపటి భావి భారత నిర్దేశకులని పలువురు వక్తలన్నారు. మండలంలోని పశువుల్లంక జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం రామాంజనేయులు అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవా భావం, నైతిక విలువలు నేర్చుకోవాలని ఉపాధ్యాయుడు మునీశ్వరరావు సూచించారు. మురమళ్ల, కేశనకుర్రు, ఐ.పోలవరంల్లోని పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

ముమ్మిడివరం: విద్యార్థులు చిన్నతనం నుంచి సత్ప్రవర్తనతో మెలుగుతూ గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా అన్నారు. మండలంలోని సీహెచ్ గున్నేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్వీ ప్రసాదరావు, దోనిపాటి ఆంజనేయులు, దాసరి సత్యనారాయణ, ఎంపీటీసీ గొలకోటి వీరహను దుర్గాప్రసాద్, హెచ్‌ఎం తాతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ముమ్మిడివరంలోని పోలమ్మ చెరువు గట్టు వద్ద గల బుద్ధ విహార్‌లో భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని స్థానిక కాంగ్రెస్ నాయకులు పెన్మత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు తదితరులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు చేతి రాత పోటీలు

అమలాపురం టౌన్: స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య స్కూలులో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చేతి రాత పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద గల నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి పాఠశాల ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు అనిల్ కుమార్ జైన్, జంపన సుమన్‌వర్మ ఆధ్వర్యంలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేవారు. కార్యక్రమంలో విద్యానిధి పాఠశాల ప్రిన్సిపాల్ టి.నాగమాధవి తదితరులు పాల్గొన్నారు.

యానాం: స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన బాలల దినోత్సవానికి ఆర్ఏఓ మునిస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశానికి బాలలు తరగని ఆస్తి అని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.